సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 10 । ఆగస్టు । 2023



పోచంపల్లిలో ఒడిశా బృందం

ఒడిశాకు చెందిన చేనేత కార్మికులు పోచంపల్లిని సందర్శించి వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు.

- 8లో



ఆర్టీసీ కార్మికులకు మంచి రోజులు

సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో ఆర్టీసీ కార్మికులకు మంచి రోజులు వచ్చాయని థామస్‌రెడ్డి అన్నారు.

- 8లో



మెరుగైన వైద్య సేవలందించాలి

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని క్వాలిటీ అనాలసిస్ అస్సెస్‌మెంట్ బృందం సూచించింది.

- 8లో

న్యూస్‌రీల్

రేపు జిల్లా స్థాయి క్రీడాజట్ల ఎంపికలు

భువనగిరి : 2023–24 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ కోసం క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, స్విమ్మింగ్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ వంటి క్రీడల్లో పోటీలు ఉంటాయన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లోపని చేస్తున్న ఉద్యోగులు సర్వీస్ సర్టిఫికేట్, గుర్తింపు కార్డుతో జిల్లా యువజన క్రీడల అధికారి కార్యాలయం వద్ద హాజరు కావాలని కోరారు.

సాగు విధానాలపై అధ్యయనం



విత్తనాలు వెదజల్లే విధానంపై రైతును అడిగి తెలుసుకుంటున్న విద్యార్థులు

ఆత్మకూరు(ఎం): మండలంలోని రహీంఖాన్‌పేటలో రైతు కొత్త పురుషోత్తంరెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు బుధవారం సందర్శించారు. వరి నారు నాటు వేయడానికి బదులుగా మొలకెత్తిన విత్తనాలను వెదజల్లే పద్ధతి తదితర సాగు విధానాలను పరిశీలించారు. రైతు పురుషోత్తంరెడ్డితో మాట్లాడి వెదజల్లే విధానం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకున్నారు. అనంతరం పాడి పరిశ్రమను పరిశీలించారు.

రైల్వే గూడ్స్ ట్రాక్ షెడ్ల పరిశీలన



ట్రాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని వంగపల్లి రైల్వే స్టేషన్‌ను బుధవారం దక్షిణ మధ్య రైల్వే పీసీసీఎం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సందర్శించి గూడ్స్ ట్రాక్ షెడ్లను పరిశీలించారు. త్వరలో పునరుద్ధరించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసుపునూరి నాగభూషణం కోశాధికారి వెంకటేశం, జిల్లా వెంకట రమణ, ఎఫ్‌సీఐ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

పనులు పెండింగ్ ఉండవద్దు

రామన్నపేట : మండలంలోని ఇస్కిళ్ల, కక్కిరేణి గ్రామాల్లో బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి పర్యటించారు. పల్లె ప్రకృతి వనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు, కంపోస్ట్ షెడ్లను పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, డీఎల్‌పీఓ సాధన తదితరులు ఉన్నారు.



జూలైలో.. వర్షాలకు నిండుకుండలా మారిన గండిచెరువు



నేడు.. కట్ట తెగడంతో నీళ్లన్నీ వెళ్లిపోయి వెలవెలబోతున్న చెరువు

గండిచెరువు ఖాళీ

యాదగిరిగుట్ట : మొన్నటి వరకు నిండుకుండలా ఉన్న యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని గండి చెరువు వెలవెలబోతోంది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రింగ్ కట్ట రెండు రోజుల క్రితం తెగడంతో నీరంతా వృథాగా వెళ్లిపోయింది. నీరు వెళ్లకుండా తూముకు గేట్ ఏర్పాటు చేసినప్పటికీ మరమ్మతులకు గురవడంతో ఫలితం లేకపోయింది. జూలైలో కురిసిన వర్షాలతో పాటు కాళేశ్వరం జలాలతో గండిచెరువు పూర్తిగా నిండి భక్తులను ఆకట్టుకుంది. రెండు రోజుల వ్యవధిలోనే నీళ్లన్నీ వృథాగా పోవడంతో మట్టి తేలి, అడుగుభాగం కనిపిస్తుంది. ఈ విషయమై నీటిపారుదల శాఖ డీఈఈ బాలకృష్ణను వివరణ కోరగా తూముకు ఏర్పాటు చేసిన గేట్ రాడ్ విరిగిపోవడంతో నీళ్లు వెళ్లిపోతున్నాయన్నారు. రెండు రోజుల్లో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

గృహలక్ష్మికి చిక్కులు!

కుల, ఆదాయ సర్టిఫికెట్లు తప్పనిసరి చేసిన ప్రభుత్వం

- సాధారణ మహిళలకు తిప్పలు
- మీసేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాలకు పరుగులు
- ఆలస్యమవుతున్న ధ్రువీకరణ పత్రాల జారీ
- నేటితో ముగియనున్న గడువు
- బుధవారం నాటికి 6వేల దరఖాస్తులు



బీబీనగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సర్టిఫికెట్ల కోసం బారులుదీరిన జనం

సాక్షి, యాదాద్రి : గృహలక్ష్మి పథకానికి ప్రభుత్వం మూడు రోజులే గడువు ఇవ్వడం, మహిళ పేరున భూమి ఉన్నవారే అర్హులన్న ఆంక్షలు, దరఖాస్తుకు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు జతపర్చడం తప్పనిసరి చేయడం.. చిక్కులు తెచ్చిపెడుతోంది. విద్యార్థులు, ఉద్యోగులు తప్ప.. సాధారణ మహిళలు కుల, ఆదాయ సర్టిఫికెట్‌లు తీసుకోవాల్సిన పరిస్థితి రాలేదు. వారంతా ఇప్పుడు సర్టిఫికెట్‌ల కోసం మీసేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాలకు ఉరుకులుపరుగులు పెడుతున్నారు.

6 వేల వరకు దరఖాస్తులు

సొంత జాగా ఉన్నవారు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షలు సాయం మూడు విడతల్లో అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి జూన్ 21న మార్గదర్శకాలు విడుదల చేసింది. దరఖాస్తుకు కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జత చేయాలన్న నిబంధన విధించడంతో వాటికోసం జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలు, 17 మండలాల పరిధిలో సుమారు 6 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షన్నరకు లోపు ఉండాలి. ప్రభుత్వం గతంలో మహిళల కోసం పలు పథకాలు ప్రవేశపెట్టినా ఆదాయ ధ్రువీకరణ అడగలేదు. కానీ, గృహలక్ష్మి పథకంలో కేవలం మహిళలకు మాత్రమే లబ్ధి చేకూర్చాలన్న ప్రభుత్వ నిర్ణయంతో వారికి సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు తప్పడం లేదు.

అదునుగా తీసుకుంటున్న దళారులు

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సర్టిఫికెట్ రావడానికి కనీసం రెండు రోజులైనా తీసుకుంటుంది. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు ప్రభుత్వం కేవలం మూడు రోజులే ఇవ్వడం, తహసీల్దార్ కార్యాలయాల్లో సర్టిఫికెట్ల జారీ జాప్యం జరుగుతుండడంతో దరఖాస్తు దారుల్లో ఆందోళన నెలకొంది. దీన్ని కొందరు వ్యక్తులు అవకాశంగా మలుచుకుంటున్నారు. ఒక్క రోజులోనే సర్టిఫికెట్ ఇప్పిస్తామంటూ నమ్మబలికి రూ.500 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల, సిబ్బంది ఓటరు నమోదు ప్రక్రియలో నిమగ్నమై ఉండడంతో సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.



యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయంలో..

స్థల ధ్రువీకరణ, ఓటరు గుర్తింపు కార్డు కూడా..

ఏదో విధంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందిన మహిళలు దరఖాస్తులను సమర్పించడానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఆదాయ, కులం సర్టిఫికెట్‌లే కాకుండా ఇంటి స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు (సొంత స్థలమేనని ధృవీకరించేలా), ఓటరు గుర్తింపు కార్డు (గ్రామంలో ఉన్నట్లుగా), ఇంటి పన్ను లేదా కరెంటు బిల్లు రశీదు, రేషన్‌కార్డు జిరాక్స్‌ను దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. అలాగే ఇంటి స్థలం జీఓ 58, 59 పరిధిలోకి లోబడి లేదా అసైన్డ్‌లాండ్ తదితర పద్ధతుల్లో పొందితే వాటి వివరాలు సమర్పించాల్సి వస్తుంది. వీటన్నింటి సిద్ధం చేసుకోడానికి దరఖాస్తుదారులకు తలకు మించిన భారంగామారింది.

కార్యాలయాలు, మీసేవలు కిటకిట

గృహలక్ష్మి పథకానికి గడువు గురువారంతో ముగియనుండడంతో దరఖాస్తు చేసుకోవడానికి గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. దీంతో మీసేవ కేంద్రాలు, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు, జిరాక్స్ సెంటర్లన్నీ కిటకిటలాడుతున్నాయి. కొన్ని చోట్ల రోడ్డుపైకి బారులుదీరారు. మధ్యమధ్యలో సర్వర్ మొరాయిస్తుండడంతో దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పడం లేదు.

గడువు పెంచాలని డిమాండ్

గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు పెంచాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సాధారణ మహిళలకు చాలా మందికి సర్టిఫికెట్‌లు లేవని, మీసేవల్లో దరఖాస్తు చేసుకున్న అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ చేయడానికి మూడు, నాలుగు రోజులైనా పడుతుందని అంటున్నారు. మద్యం టెండర్లకు నెల రోజులు గడువు నిరుపేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చే గృహలక్ష్మి పథకానికి మూడు రోజులే సమయం ఇవ్వడం సరికాదన్నారు. నెలాఖరు వరకు గడువు పెంచాలని కోరుతున్నారు. కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

త్వరలో వినియోగంలోకి హ్యాండ్లూమ్ పార్కు

- రాష్ట్ర చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి
- చేనేత సంఘాల నాయకులతో సమావేశం



డైరెక్టర్‌కు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్న చేనేత సంఘం నాయకులు

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును రెండు నెలల్లో వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తుందని చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి తెలిపారు. బుధవారం ఆమె కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితో కలిసి భూదాన్‌పోచంపల్లిలో చేనేత సంఘాల నాయకులు, కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్కులో ఉన్న 500 మగ్గాల ద్వారా సుమారు 1,500 మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్కు నిర్వహణకు గాను ప్రభుత్వం కొన్ని ప్రతిపాదనలు కూడా చేసిందన్నారు. అనంతరం హ్యాండ్లూమ్ పార్కును విజయవంతంగా నిర్వహించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందని చేనేత సంఘాలు, కార్మికుల అభిప్రాయాలు, సలహాలు స్వీకరించారు. మాస్టర్ వీవర్స్ లేదా కొన్ని సంస్థలకు పార్కు నిర్వహణ బాధ్యతలు అప్పగించి వారికి ప్రభుత్వం నుంచి సహకారం అందజేస్తే ఎలా ఉంటుందని తెలుసుకున్నారు.

వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

హ్యాండ్లూమ్ పార్కులో ఉండటానికి నివాసం, ఇతర మౌలిక వసతులు కల్పించి మెరుగైన వేతనం ఇస్తే కార్మికులు మగ్గం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని చేనేత సంఘం నాయకుడు, సంస్థాన్ నారాయణపురం మాజీ జెడ్పీటీసీ బొల్ల శివశంకర్, చేనేత టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్, అంకం మురళీ డైరెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్మికులు నేసిన వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తేనే పార్కు నడుస్తదన్నారు. అనంతరం సాయిని భరత్ నెలకొల్పిన కళాపునర్వి మగ్గాల యూనిట్‌ను డైరెక్టర్, కలెక్టర్ సందర్శించారు. యూనిట్ నిర్వహణ, ఎంత మందికి పని కల్పిస్తున్నారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటేశం, టెస్కో ఓఎస్‌డీ రతన్, హ్యాండ్లూమ్‌పార్క్ మాజీ సీఈఓ కోప్రసాచారి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశం, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్ గుండు మధు, చేనేత నాయకులు అంకం మురళి, సీత వెంకటేశం, సీత శ్రీరాములు, చింతకింది రమేశ్, భారత వాసుదేవ్, భోగ బాలయ్య, సాయిని భరత్, కర్నాటి పురుషోత్తం, కొంక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపురం గ్రామస్తుల దీక్షకు ఏడాది



పాట్టిమర్రి వద్ద దీక్ష చేస్తున్న అఖిలపక్ష నాయకులు

- మండలం ఏర్పాటు చేయాలని వివిధ రూపాల్లో ఆందోళన

రాజాపేట : మండలంలోని రఘునాథపురంను మండలంగా ఏర్పాటు చేయాలని అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం నాటికి ఏడాదికి చేరింది. దీక్షలో భాగంగా ఏడాది కాలంగా వంటా వార్పు, మానవహారం, రాస్తారోకో వంటి కార్యక్రమాలతో నిరసన తెలుపుతున్నారు. ఉన్నతాధికారులకు, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డికి, మంత్రి కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కుడుదుల నగేష్, మాజీ ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి బీర్ల ఐలయ్యతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు దీక్షకు సంఘీభాం తెలిపారు. బుధవారం చేపట్టిన దీక్షలో నాయకులు బుడిగె పెంటయ్య గౌడ్, చిన్న పోయ్య, కొమురయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నాగేష్, రామచంద్రం, నర్సింగరావు, బోగ పాండు, భాస్కర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా అండెం సంజీవరెడ్డి

- ఉత్తర్వులు జారీ చేసిన ఏఐసీసీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్
- పంతం నెగ్గించుకున్న కోమటిరెడ్డి



సాక్షి యాదాద్రి : జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా గుండాల మండలం నూనెగూడేనికి చెందిన అండెం సంజీవరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పార్టీని వీడీ బీఆర్ఎస్‌లో చేరడంతో ఖాళీ ఏర్పడిన విషయం తెలిసిందే. కాగా ఆ స్థానానికి జెడ్పీ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డిని మాజీ మంత్రి కే.జానారెడ్డి ప్రతిపాదించగా.. అండెం సంజీవరెడ్డి పేరును ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. వీరితో పాటు మరికొందరు పోటీపడ్డారు. దీంతో అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొంది. ఇరువురు ముఖ్యనేతలు కావడంతో వారు సూచించిన పేర్లను పీసీసీ అధ్యక్షుడు ఏఐసీసీకి పంపారు. చివరికి స్థానిక ఎంపీగా ఉన్న వెంకట్‌రెడ్డి సూచించిన వ్యక్తిని నియమించారు. దీంతో కోమటిరెడ్డి వర్గీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చేనేత కార్మికులను ఆదుకుంటాం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



మగ్గం నేస్తున్న గొంగిడి సునీత

ఆలేరురూరల్ : చేనేత కార్మికుల సంక్షేమానికి ఏ రాష్ట్రంలో లేనివిధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. చేనేత వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలేరులోని వైఎస్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చేనేతమిత్ర పథకం ద్వారా నూలు, రంగులు, రసాయనాలపై 40శాతం సబ్సిడీ, జియో ట్యాగింగ్ మగ్గాల నిర్వాహకుల ఖాతాల్లో నెలకు రూ.3వేలు జమ చేస్తుందన్నారు. నేతన్న బీమా పథకం అమలు చేస్తుందని చెప్పారు. చేనేత సంఘాల వ్యాపార కార్యకలాపాలను మరింత సులభతరం చేసేందుకు జిల్లా, కేంద్ర సహకార బ్యాంకులు నగదు క్రెడిట్ విధానాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విద్యాసాగర్, మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతిప్రవీణ్, పుట్ట మల్లేషం, మాజీ సర్పంచ్ చింతకింది మురళి, మాజీ జెడ్పీటీసీ బొట్ల పరమేశ్వర్, బాలస్వామి, చేనేత కార్మిక సంఘాలు, పద్మశాలి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సర్దుబాటుతో వీఆర్ఏలకు లబ్ధి

యాదగిరిగుట్ట : వీఆర్ఏల అభ్యున్నతిపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తెలిపారు. యాదగిరిగుట్టలో బుధవారం వీఆర్ఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చాలా మందికి లబ్ధి చేకూరనుందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో 275 మంది వీఆర్ఏలు రెవెన్యూలో సర్దుబాటు అయినట్లు వెల్లడించారు.

16 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

భువనగిరి : జిల్లాలో ఈనెల 16నుంచి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించనున్నట్లు కుష్టు నివారణ జిల్లా అధికారి డాక్టర్ పాపారావు తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 31వరకు సర్వే పూర్తి చేయాలన్నారు. వైద్యసిబ్బంది గుర్తించిన వారికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వీడీసీపీ అధికారి డాక్టర్ వినోద్‌కుమార్, డీపీఎస్ ధరణికుమార్, జ్యోతి, సతీష్‌కుమార్, మల్లేష్, బసవరాజ్, లెప్రసీ నోడల్ పర్సన్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి


శ్రీనివాస్ (ఫైల్)

వలిగొండ : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. వలిగొండ మండలం ప్రొద్దుటూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన బత్తుల శ్రీనివాస్(48) రోజూ మాదిరిగా కల్లు తీయడానికి గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

నీట మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

- మృత్యువులోనూ వీడని స్నేహ బంధం
- గేదెలు మేపేందుకు వెళ్లగా దుర్ఘటన



ఉపేందర్, అనిల్ మృతదేహాల వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు

కోదాడరూరల్ : గేదెలు మేపేందుకు వెళ్లిన ఇద్దరు స్నేహితులు నీటి గుంటలో మునిగి ప్రాణాలు విడిచారు. సూర్యాపేట జిల్లాలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ మండలం రెడ్లకుంట గ్రామానికి చెందిన పొలంపల్లి స్వామి, అన్నపూర్ణ దంపతుల పెద్ద కుమారుడు అనిల్‌కుమార్(15) కాపుగల్లులో 10వ తరగతి చదువుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన చిర్రా తిరపయ్య సునీతల కుమారుడు ఉపేందర్ (13) కోదాడలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ 7వ తరగతి చదువుతున్నాడు. ఉపేందర్‌కు జ్వరం రావడంతో వారం రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అనిల్‌కుమార్, ఉపేందర్ స్నేహితులు. కాగా, అనిల్‌కుమార్ తల్లికి కళ్లకలక రావడంతో బుధవారం కుమారుడిని గేదెల వద్దకు పంపింది. విషయం తెలుసుకున్న ఉపేందర్ మధ్యాహ్నం తర్వాత స్నేహితుడు అనిల్ వద్దకు వెళ్లాడు. ఇద్దరూ కలిసి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో గేదెలను మేపుతున్నారు.

ఈతరాక నీట మునిగి..

ప్రభుత్వ భూమిలో కొందరు మట్టికోసం పెద్ద గుంటను తవ్వగా ఇటీవల కురిసిన వర్షాలకు నిండింది. ఆ గుంటలోకి గేదెలు వెళితే ఒడ్డుకు మళ్లించేందుకు దిగారో లేక ఈత కొట్టేందుకు దిగారో తెలియదు గానీ, అనిల్‌కుమార్, ఉపేందర్ ఒంటిపై ఉన్న దుస్తులు విప్పి నీటిలోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండడం, ఈత రాకపోవడంతో నీట మునిగి మృతిచెందారు. సాయంత్రమైనా అనిల్ ఇంటికి రాకపోవడంతో


అనిల్‌కుమార్ (ఫైల్)


ఉపేందర్ (ఫైల్)

తల్లి అన్నపూర్ణ వెతుక్కుంటూ గ్రామ శివారుకు వచ్చింది. రోడ్డు వెంట గేదెలు ఉండగా కుమారుడు కనిపించలేదు. సమీపంలోని నీటి గుంట వద్ద దుస్తులు కనిపించడంతో లబోదిబోమంది. దీంతో రోడ్డు వెంట వెళ్తున్న వారు వచ్చి నీటి గుంటలోకి దిగగా కాళ్లకు ఇద్దరి మృతదేహాలు తగలడంతో బయటికి తీశారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. మృత్యువు సైతం మీ స్నేహబంధాన్ని విడదీయలేక పోయిందా అంటూ గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. పోలీసులు వచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తరలించేందుకు ప్రయత్నించగా మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిలో మట్టి తవ్విన వారిపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు మృతదేహాలను తరలించేది లేదని భీష్మించారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో శాంతించారు. అనంతరం మృతదేహాలను కోదాడ ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ కార్మికులకు మంచి రోజులు

- విలీన ప్రక్రియపై అధ్యయనానికి విజయవాడకు వెళ్తున్నాం
- వారం రోజుల్లో పూర్తిస్థాయి గెజిట్ వస్తుంది
- తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి


సూర్యాపేట: మాట్లాడుతున్న మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి

భానుపురి(సూర్యాపేట) : ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయంతో ఆర్టీసీ కార్మికులకు మంచి రోజులు వచ్చాయని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి అన్నారు. బుధవారం విజయవాడ పర్యటనకు వెళుతున్న ఆయనకు సూర్యాపేటలో ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు, టీఎంయూ నాయకులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి ప్రక్రియలో భాగంగా అధ్యయనం కోసం విజయవాడకు వెళ్తున్నామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. సీఎం కేసీఆర్ కార్మికుల కోరికను తీర్చారని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వమే కాపాడుతుందని చెప్పి సీఎం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో 43వేల మంది కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. ఆర్టీసీ బిల్లు రాజ్‌భవన్‌కు వెళ్లిన సమయంలో హైడ్రామా జరిగిందని, ఇప్పుడు బిల్లు పాస్ కాకుంటే కార్మికులు అంధకారంలోకి వెళ్తారని చెప్పి తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆందోళనలకు పిలుపునిచ్చిందన్నారు. ఒక్కరోజులోనే 7వేల మంది కార్మికులు రాజ్‌భవన్ ముట్టడికి వచ్చారని తెలిపారు. తదనంతరం గవర్నర్ కార్మికుల సమస్యలు విని ప్రభుత్వ సమాధానాలతో ఆమోదం తెలిపారని చెప్పారు. అసెంబ్లీలో బిల్లు పాస్ కావడం ఆర్టీసీ కార్మికుల విజయమని థామస్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విలీనం సమయంలో కొన్ని ఇబ్బందులు వచ్చాయని, కార్మికులకు అన్యాయం జరిగిందని, ఇక్కడ ఆ పరిస్థితి లేకుండా ఉండేందుకు అధ్యయన కమిటీ ఏర్పడిందన్నారు. 8మంది సభ్యులతో కూడిన కమిటీ రెండు రోజుల పాటు విజయవాడలో విలీన ప్రక్రియను అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. వారం రోజుల్లోనే పూర్తి స్థాయిలో గెజిట్ వచ్చే అవకాశం ఉందన్నారు. విలీనంపై ఎవరికీ అనుమానాలు అవసరం లేదన్నారు. నూతన బస్సులు కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా సంఘం చీఫ్ అడ్వయిజర్ యాదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్‌గౌడ్, కోశాధికారి రాఘవరెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, బి.నరేందర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎంయూ హైదరాబాద్ జోన్ జాయింట్ సెక్రటరీ సుంకరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు బెల్లి నర్సయ్య, ఎస్ఎస్ గౌడ్, బొజ్జ సైదులు, మాచర్ల లచ్చయ్య, చెరుకు వెంకటయ్య, చల్కపల్లి వెంకన్న, ఎండీ.జాని, ఇండ్ల నరేష్, గోవిందరాజులు, సావిత్రి, మేరీ, స్వరూప, మాధవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లిని సందర్శించిన ఒడిశా చేనేత కార్మికులు


చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఒడిశా కార్మికులు

భూదాన్‌పోచంపల్లి : ఒడిశా రాష్ట్రానికి చెందిన 16మంది చేనేత కార్మికులు బుధవారం పోచంపల్లిని సందర్శించారు. స్థానిక చేనేత సహకార సంఘం, కళా పునర్వి యూనిట్, చేనేత గృహాలను పరిశీలించారు. ఇక్కడ మగ్గాలపై తయారవుతున్న ఇక్కత్ వస్త్రాలు, రంగులద్దే విధానం, చిటికి కట్టడం, డిజైన్లు పరిశీలించి ఇక్కడి కార్మికుల కళానైపుణ్యాలను కొనియాడారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్ర హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండిక్రాఫ్ట్ ఇన్‌స్పెక్టర్ సునిల్‌కుమార్ మాట్లాడుతూ పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీ విధానాన్ని తెలుసుకొనేందుకు ఎక్స్‌ప్లోరర్ విజిట్‌లో భాగంగా ఒడిశాలోని జార్సిగూడ జిల్లాకు చెందిన కార్మికులతో వచ్చామని పేర్కొన్నారు. ఇక్కడి నేత విధానం, డిజైన్లు ఎంతో బాగున్నాయన్నారు.

కబడ్డీ కోచ్‌గా నకిరేకల్ వాసి

నకిరేకల్ : నకిరేకల్‌కు చెందిన గంజి సాయి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్‌ఐఎస్) కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఇటీవల స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్‌ఏఐ),నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో బెంగళూరులో నిర్వహించిన కబడ్డీ కోచ్‌ల క్యాంపులో నకిరేకల్ వాసి గంజి సాయి శిక్షణలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. బెంగళూరు జోనా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డాక్టర్ హసన్ జానీ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం తీసుకున్నానని సాయి తెలిపారు.

17వరకు జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు

పెద్దవూర: మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల సౌకర్యార్థం ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఎలాంటి రుసుము లేకుండా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ లేదా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.నల్లగొండ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోలీస్ పహారాలో అంత్యక్రియలు

మోత్కూరు : దళిత బంధు రాకుండా అడ్డుకున్నారనే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న మోత్కూరులోని గాంధీనగర్ కాలనీకి చెందిన కూరెళ్ల రమేష్ మృతదేహానికి బుధవారం పోలీస్ పహారాలో అంత్యక్రియలు నిర్వహించారు. దళిత బంధు రాకుండా తమ కౌన్సిలర్ కూరెళ్ల కుమారస్వామే అడ్డుకున్నారని రమేష్ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి దహనసంస్కారాలను పూర్తి చేయించారు. కాగా, రమేష్ ఆత్మహత్య కాదని, ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్ ఆరోపించారు. బుధవారం మోత్కూరులో రమేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆయన కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'పులిచింతల'లో పెరిగిన విద్యుత్ ఉత్పత్తి

హుజూర్‌నగర్ : పులిచింతల ప్రాజెక్టులోని టీఎస్ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి కొంత పెరిగింది. మంగళవారం 7,800 క్యూసెక్కుల నీటితో రెండు యూనిట్ల ద్వారా 50 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగా బుధవారం 8,800 క్యూసెక్కుల నీటితో 55 మెగావాట్లను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. పవర్ హౌజ్ ద్వారా 8,800 క్యూసెక్కులు లీకేజీ ద్వారా 200 క్యూసెక్కులు కలిపి 9 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 32.62 టీఎంసీల నీరు ఉంది.

రెండిళ్లలో చోరీ

నల్లగొండ క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు నీలగిరిలోని రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. నల్లగొండ పట్టణంలోని రాక్‌హిల్స్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు రాంబాబు ఇంట్లోకి మంగళవారం రాత్రి చొరబడ్డారు. అతడి ఇంట్లో విలువైన వస్తువులు దొరకలేదు. మరో రెవెన్యూ ఉద్యోగి ప్రదీప్ కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగానే దుండగులు వారి వెనుక డోర్‌నుంచి వెళ్లి 15 తులాల బంగారం అపహరించుకుపోయారు. బుధవారం ఉదయం లేచి చూడగా అన్ని డోర్‌లు తీసి ఉండటంతో పాటు సామగ్రి చిందరవందరగా ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్‌ఐ నాగరాజు పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాయగిరిలో బైకు..

భువనగిరి : గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌తో పాటు మొబైల్‌ను అపహరించారు. భువనగిరి మండల పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా.. రామన్నపేట మండలం ఎన్నారం గ్రామానికి చెందిన కడారి రవి ఈ నెల 7న బోడుప్పల్‌లో ఉన్న సోదరి ఇంటికి వెళ్లాడు. 8న రాత్రి బోడుప్పల్ నుంచి యాదాద్రికి బయలుదేరాడు. భువనగిరి మండలం రాయగిరి గ్రామ పరిధిలోని కమాన్ వద్దకు రాగానే కళ్లు తిరుగుతున్నట్లుగా అనిపించడంతో సమీపంలోనే ఉన్న వాటర్ వాష్ చేసే షాపు వద్దకు వెళ్లాడు . షాపు వద్ద బైకు నిలిపి అక్కడే పడుకున్నాడు. కొద్దిసేపటికి లేచి చూడగా బైకుతో పాటు జేబులో ఉన్న మొబైల్ కనిపించలేదు. దీంతో బుధవారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

చింతపల్లి : కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన చింతపల్లి మండల పరిధిలోని కొర్ర మాన్‌సింగ్‌తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొర్ర మాన్‌సింగ్‌తండాకు చెందిన రమావత్ కవిత(45) భర్త బాలుతో తగాదాపడి మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు రాత్రి తండాతో పాటు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం గ్రామసమీపంలోని వాగులో కవిత మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ముక్తాపూర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన కేంద్ర బృందం


ఫార్మసీ విభాగాన్ని పరిశీలిస్తున్న కేంద్ర క్వాలిటీ అనాలసిస్ బృందం

భూదాన్‌పోచంపల్లి : ప్రభుత్వం నిర్దేశించిన సూచనల మేరకు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కేంద్ర క్వాలిటీ అనాలిసిస్ అస్సెస్‌మెంట్ బృందం కోరింది. భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం కేంద్ర క్వాలిటీ అనాలిసిస్ అస్సెస్‌మెంట్ బృందం సందర్శించింది. పర్యవేక్షకులు డాక్టర్ విజయరామనన్, డాక్టర్ భరణికుమార్‌లు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ద్వారా రోగులకు అందుతున్న వైద్యసేవలు, విభాగాల వారీగా రికార్డులు పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, జాతీయ రోగ నిరోధక కార్యక్రమాలపై ఆరా తీశారు. వైద్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యశోద, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సుమన్‌కల్యాణ్, వైద్యాధికారులు యాదగిరి, శ్రీనివాస్, సందీప్, జిల్లా క్వాలిటీ మేనేజర్ రిజ్వాన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోతారెడ్డి, సూపర్‌వైజర్ అరుంధతి, ఆరోగ్య కార్యకర్తలు భవానీ, నాగమణి, వాణి, రేణుక, ఎంఏ బేగ్, ఆశాలు నాగమణి, మనోహర, చందన, రాధిక, ఫార్మాసిస్ట్ కవిత, లక్ష్మణ్‌బాబు, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

కేతేపల్లి: వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. కేతేపల్లి, నడిగూడెం, కోదాడ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన హౌగి హన్మంత్ పట్ని(39) డీసీఎంను నడుపుకుంటూ మంగళవారం అర్ధరాత్రి విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో బుధవారం తెల్లవారుజామున కేతేపల్లికి సమీపంలోకి చేరుకోగానే రోడ్డు పక్కను నిలిపి ఉన్న మరో లారీని వెనుక నుంచి డీసీఎం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎంనడుపుతున్న హన్మంత్ పట్నికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేతేపల్లి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు హన్మంత్ రాచప్ప పట్ని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి..

నడిగూడెం : నడిగూడెం మండలం వల్లాపురం గ్రామానికి చెందిన పల్లా రవీందర్‌రెడ్డి (50) ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం రాజాపేట రెవెన్యూ పరిధిలోని తన వ్యవసాయ భూమిలో బుధవారం ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ తిరగబడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

లారీ ఢీకొని..

కోదాడరూరల్ : చిలుకూరు మండలం నారాయణగూడెం గ్రామానికి చెందిన అవ్వారు రాంబాయమ్మ(68) బుధవారం కోదాడలో ఉంటున్న కూతురు ఇంటికి బయలుదేరింది. కోదాడకు చేరుకున్నాక హుజూర్‌నగర్ రోడ్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న లారీ ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమదంలో రాంబాయమ్మకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. మృతురాలి కుమారుడు భూషయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పది రోజుల్లో బర్త్‌డే.. ఇంతలోనే విషాదం

- నీటి గుంటలో పడి బాలుడు మృతి


ధ్రుపత్(ఫైల్)

కనగల్ : మరో పది రోజుల్లో జన్మదిన వేడుకను జరుపుకోనున్న బాలుడు ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతిచెందాడు. నల్లగొండ జిల్లాలో జరిగిన ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కనగల్ మండలం పానుగోడు గ్రామానికి చెందిన పుకరం మల్లికార్జున్‌రావు, పావని దంపతులకు కుమార్తె దాక్షాయిని, కుమారుడు ధ్రుపత్ (2) సంతానం. మల్లికార్జున్‌రావు పెద్దవూర గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన పీఈటీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. చండూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్న దాక్షాయిని నిత్యం బస్సులో వెళ్లి వస్తుంది. అయితే, సోదరి పాఠశాలకు వెళ్లే సమయంలో ధ్రుపత్ వెంట వస్తానని మారాం చేస్తుంటాడు. దీంతో పావని బుధవారం ఉదయం ధ్రుపత్‌ను సమీప బంధువు ఇంట్లో వదిలి కుమార్తెను తీసుకుని బస్టాప్‌కు వెళ్లింది.

బంధువు ఇంటి నుంచి వెళ్లిపోయి..

ధ్రుపత్‌కు సమీప బంధువు జామకాయ ఇచ్చి తింటూ ఆడుకోమని చెప్పి ఆమె ఇంటి పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో ధ్రుపత్ గేటు తీసుకుని ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. పావని ఇంటికి వచ్చిన తర్వాత ధ్రుపత్‌ను తీసుకువెళ్లేందుకు బంధువు ఇంటికి వెళ్లగా అక్కడ కుమారుడు కనిపించలేదు. మూడు గంటల పాటు గ్రామంలో వెతుకులాడగా గ్రామ మాజీ సర్పంచ్ ఇంటి పరిసరాల్లో ఓ మహిళ ఇల్లు నిర్మించుకునేందుకు తీసిన నీటి గుంటలో ధ్రుపత్ విగతజీవుడై తేలియాడుతూ కనిపించాడు. ముక్కుపచ్చలారని కుమారుడు ఇక లేడని తెలుసుకుని తల్లి గుండెలవిసేలా రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న చండూరు సీఐ వెంకట్, ఎస్‌ఐ అంతిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాలుడి మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, ధ్రుపత్ మరణంపై గ్రామంలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.